డ్యూయల్ డస్కులా? సింగిల్ డస్కులా?

ఈ వ్యాసముయొక్క మకుటం కేవలం ఇంగ్లీషు పదాలతోనే వ్రాశాను. ఆలా ఆ భాషలో వ్రాయాలనే వ్రాశాను. "తెనుగు" "తెనుగు" అని ఎవరూ గొంతెత్తవద్దు. నేను వ్రాయబోతూ వున్నది 1907 కు సంబంధించిన ఒకానొక విశేషం. మఱీన్నీ మిక్కిలి దేశభక్తి పూరితమైనటువంటిదిన్నీ: అందఱూ తెలుసుకు జ్ఞాపకముంచుకో తగ్గదిన్నీ!—అంచేత ఏమాత్రం అవకాశం వున్నా నేను ఆంగ్లేయ పదాలు వాడేవాణ్ణి కాదు. అయితే ఏం చెయ్యను? తప్పనిసరి వచ్చింది.

ఆ యేడు రాజమహేంద్రవర నగరంలోని ప్రభుత్వ కళాశాలా విద్యార్థులు సమ్మెకట్టారు. బోధనాభ్యాసనాశాలలోనివారు గాని, దానికి సంబంధించిన ఆదర్శ పాఠశాలలోనివారుగాని ఎవ్వరూ సమ్మెకట్టలేదు. దానికి కారణం అనేకమంది అనేక విధాలుగా అప్పట్లో అనుకునేవారు. ఒకటి, ప్రభుత్వ కళాశాలాధ్యక్షుడు తెల్లదొర కావడంచేత, నల్ల పిల్లల కోరికలు మన్నించి వుండలేదని, బోధనాభ్యాసనాశాలాధ్యక్షులు నల్లవాడు కావడంచేత మనవాళ్ళపట్ల సానుభూతితో మెలగి యున్నాడని ఒక కొందఱు, రెండు, ప్రభుత్వ కళాశాలా విద్యార్థులు పెద్దవాళ్లు కావడంచేతను ఎక్కువ స్వతంత్రత చూపగలిగారని, బోధనాభ్యాసనాశాలా విద్యార్థులు పసిపిల్లకాయలు, పసిపిల్లకాయలతో వ్యవహరించివలసిన అభ్యసనోపాధ్యాయులు కావడంచేత సమాన స్వతంత్రత చూపించలేకపోయారని మఱికొందఱు అంటూ వచ్చారు. పై రెండు కారణాలూ కాదు: ప్రభుత్వ కళాశాలకు సరియైన ప్రహరీగోడ లేదు, ఎటుచూచిన వెత్తికంచలే, అంచేత

అందుగల విద్యార్థులు చులాగ్గా, ఇవలకు వచ్చేసెయ్యడానికి వీలుంది: బోధనాభ్యాసనాశాలకో? చుట్టూ గట్టి గోడ వుంది. మఱీన్నీ జైలు ద్వారాలులాంటి ద్వారాలున్నాయి. లోపలకు వచ్చినవాండ్లు వెలుపలకు వెళ్ళడానికి వీలులేని తాళాలు వేసేస్తారు వేళకాగానే, అని మూడో తెగవారు నిర్వచించారు.

పై కారణాలన్నింటి మాటకేం? కొందఱనుకున్నారు—మేము, అనగా బోధనాభ్యాసనాశాలా విద్యార్థులం, ఎవళ్ళమూ, నాటికి క్రితం సాయంతరం ఇవ్వబడ్డ ఒకానొక సుప్రసిద్ధ దేశ నాయకుని రాజకీయోపన్యాసము వినలేదని — ఆ కారణంగా స్తబ్ధత్వం వహించి మేం సమ్మెకట్టలేదని—అవితే నిజానికి మేమూ మా గురువులూకూడా విన్నాం, ఆ—వాని గంభీరోపన్యాసము; అందలి ముఖ్య సూత్రములు, బంగాళావిభజన తిరస్కరణము, విదేశవస్త్ర బహిష్కరణము, వందేమాతరం పునశ్చరణము అని—మఱీన్నీ బాప్ లాల్ పాల్ ఈ ముగ్గురే త్రిమూర్తులు అని — "సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం" అన్నవే మాతృదేశముయొక్క గుణత్రయమని,—ఇంకా ఏమేమో నేర్చాం మేమూను. మేముకూడా దేశభక్తి పతకాలు కొనుక్కొని చొక్కాలకు తగిలించుకున్నాం, బాప్ లాల్ పాల్ పటాలు చేతపట్టాం, గొంతులు బొంగురుపోయేలా "వందేమాతరం" అని అఱిచాం. అయితే క్రియదగ్గఱ కొంచెం పప్పులో అడుగేశాం! దానిక్కారణం, అట్టే ఆలోచిస్తే మేం కాం అని తుదకు తేల్చేశాం. ఆ మేటియుపన్యాసకుడే మా వెంబాటుకు కారకుడని ఇటు అటు చూశాం! కాని అతగాడు ఆ రాత్రే రైలెక్కి వెళ్ళిపోయినాడన్నారు.

ముఖ్య విషయానికి వద్దాం! వక్త చిట్టచివర తన యుపన్యాసంలో ఒక ముక్క చెప్పాడు. "ఈనాటి ఆంగ్లేయ ప్రభుత్వము యొక్క పాలనావిధానము విభజన. బంగాళా విభజనముండి పాఠశాలల్లోని బల్లల విభజనదాకాను అని తెలుసుకోండి విద్యార్థులు!" అన్నాడు. "మటిన్నీ డ్యూయల్ డస్కులన్నీ తీసేసి రేపటినుంచి సింగిల్ డస్కులు వేసి మిమ్మల్ని మీ మాస్టర్లు కూర్చోపెట్టారా అంటే, మీ మాస్టర్లు ఎవరి నాణెం తింటూవున్నారో వారి ఔన్నత్యంకోసం ఆలా చేశారు అని మీరు తెలుసుకోండి విద్యార్థులు! మీ బాగుకోసం మీ జ్ఞానంకోసం కాదు!" అని హెచ్చరించాడు.

ఫలితం:—మేం, యావన్మందిం, బోధనాభ్యాసనాలయ సచ్ఛాత్రులం, మర్నాడు తెల్లాఅకుండానే పాఠశాలకు వెళ్ళిపోయి మా మా తరగతుల్లోని బల్లలమీద కూర్చున్నాం! అప్పట్లో ఆ బల్లలన్నీ డ్యూయల్ డస్కులే! మేం లేచిపోతిమా, ఎక్కడ వాటిని సింగిల్ డస్కులుగా మార్చి ప్రభుత్వానికి మా గురువులు పరువు ప్రతిష్ఠలు ఇంకా కలిగిస్తారేమో అని భయం! మాబాగా వంచించాం మా గురువుల్ని, మా గురువులకు జీతాలు ఇచ్చే సర్కారువారిని అని మాలో మేం ఉప్పొంగిపోయాం—

నిజానికి మేం కావించిన నాటి చర్య అంతా మా మాస్టర్లు కావాలని కోరిందే! ప్రిన్సిపాల్‌గారు సంతోషించడానికి అవకాశం ఇచ్చేదే! కాని మా అమాయకదృష్టి అంతచేటు అంచనా కట్టలేకపోయింది.

ఆనాడుపాధ్యాయులు వేళకు పాఠశాలకు వచ్చేసరికి, వారికంటే చాలాముందుగా మేము, అనగా విద్యార్థులం వచ్చి,

బర్లో డ్యూయల్ డస్కు ల్నంటిపెట్టుకూర్చొని వున్నాం. గ్రహించారనుకుంటాను, మా మనస్తత్వము, మా మైనపు మెత్తనాను! ఏమా అంటే మూడోనాడు విన్నాం ఆ సంగతి; ఏవేళకు మేం ఈ పాఠశాలలో కూర్చుని పాఠాలు నేర్చుకుంటూ బుద్ధిగా వున్నామో ఆవేళ కప్పుడే ప్రభుత్వకళాశాలా విద్యార్థులు పెద్ద విప్లవం తలపెట్టి అంతా ఒక్కపెట్టున "వందేమాతరం" ప్రతిధ్వానంతో ఇవలకు వచ్చేసి సమ్మెకట్టేశారని—

అయితే మా పాఠశాల్లో ఆ ఉదయం ఏం జరిగిందీ అంటే—మా దగ్గఱావుంది "వందేమాతరం" గీతం అచ్చుపడ్డ కరపత్రం! మా దగ్గఱా వున్నాయి బాప్ లాల్ పాల్ పటాలు మూడూ కలిసివున్న చిత్రం, మా దగ్గఱా వున్నాయి. "భరత మాత" పతకాలు కాని మేం మా డ్యూయల్ డస్కులు ఎక్కడ పోతాయో అవి నిలబెట్టుకుంటి మా బంగాళా విభజనమును అడ్డు తగిలినంత గొప్ప మాట అని అట్టే కూర్చుండిపోయాం— డ్యూయల్ డస్కులు అంటే అంత అభిమానం ఎందుకంటా రేమో—అందుమీద ఇద్దఱం ఇద్దఱం కూర్చొని అన్యోన్యం పరిచయం కలిగివుండి, ఐకమత్యమునకు చిహ్నం గాళ్లమై యుండగలము చూడండి. ఆ ఆ కారణంగా ఆలా కూర్చుండి పోయాం!—

మొట్టమొదటి పాఠంనాడు "ఫిసిక్సు" అనగా పదార్థ విజ్ఞాన శాస్త్రము; ఆ-"రావు" గారు తన సహజ సంగీత ధోరణిలో ఒక "ట్యూనింగ్ ఫోర్కు" తీసికొనివచ్చి, కొంత సేపు దానిగుండా సిద్ధాంతీకరించి, చిన్న చిన్న జంత్రాల్నుంచి వీణదాకా మీటించి ఆ వీణమీద ఒక త్యాగరాజకృతి స్వయంగా

ఆలాపించి "పిల్లల్లారా! ఇవేకాదు కొత్తపాటలు మీ దగ్గఱ వుంటే అవికూడ ఆలాపించవచ్చు సుమండీ ఈలాగేను" అని పురిగొల్పారు. వెంటనే తరగతి పిల్లకాయలం అందఱం మా జేబుల్లో వున్న "వందేమాతరం" పాటను ఎవళ్ళమట్టుకు వాళ్ళం పైకితీసి ఆయనకు అందిస్తూ ఈ పాట పాడుతుందేమో చూడమన్నాం!" ఆయన ఆ కీటుకు గ్రహించి, గడుసువాడేమో. అవన్నీ బొత్తెట్టి తన జేబులో పెట్టుకుంటూ, గడియారం చూచి "ఈ రోజుకు వేళయింది" అనేలో గంట మోగింది. "ఇవన్నీ నావద్ద వుంచండి. రేపటికి సాధకం చేసి మీకు బోధిస్తాను" అని వెళ్ళిపోయారు. ఆ—"రావు" గారి వెనకాలే వెళ్ళి ఆ కర పత్రాలు ఊళ్ళాకోవడానికి తగినంత చొఱవ మాకు అప్పట్లో లేకపోయింది. అంతలోకే రెండో "పీరియడ్" పాఠం చెప్పే ఇంగ్లీషు మాస్టారు—"శర్మ" గారు వచ్చారు.

వారేమన్నా వస్తూనే నాడు నల్లబల్లమీద "దత్తాత్రేయ" పటం వ్రేలాడకట్టారు. ఆ—"శర్మ" గారు అన్న ఆయన స్వతస్సిద్ధంగా మతం బోధించే తత్వంగల మనిషి. "రోడరిక్ ధూ" పాఠం ఎంత ప్రత్యక్ష ప్రదర్శనంగా బోధించగలడో, భగవద్గీతలోని "అర్జున విషాదయోగం" కూడా అంత హృద యాకర్షణీయంగా నేర్పగలడు. ఆయన నాటి పాఠం ప్రారంభిస్తూ చెప్పేది ఇంగ్లీషు పాఠం కాదనుకుంటామేమో అని. హోలీ బైబిల్ పేరు ముందు ఎత్తుకుంటూ అందునుంచి "గాడ్, ది, ఫాదర్" "సన్, ది, క్రైస్టు" మూడో "ద హోలీ ఘోస్టు" అని ప్రతిపాదించి, ఏ కనుమూతలోనో బ్రహ్మా విష్ణు మహే శ్వరత్రయమును నిరూపించి, మాకు తెలియకుండానే

"దత్తాత్రేయ" స్వరూపాన్ని పెద్ద ఇంగ్లీషు వాగ్జాలంలో వర్ణించి, మీవద్ద ఎటువంటి పటాలున్నా వాటన్నింటినీ ఒక్క మొండెంమీద నిలబడ్డ త్రిముఖంగా చూడాలి గాని వేఱువేఱుగా చూడరాదన్నారు. "వీరి నీనా? అండీ!" అని మేం పిల్లకాయల మందలం మా వద్దనున్న "బాప్ లాల్ పాల్" పటాలను తీసి ఆయనకు ఇచ్చాం. ఆయన వాటి నన్నింటినీ మానుండి సంగ్రహించుకుంటూ "ఆఁ. వీరినీని! వీరిని ఏకం చేయడం ఏలాగో రేపు చెబుతాను. నా దగ్గఱ వుండనియ్యండి ఈ రోజుకు" అన్నారు. మేం ఆయనను నమ్మి ఆయనవద్ద వుంచేశాం. వుంచక ఏం చేయం? గంట మళ్ళీ వినబడె! మూడో మాస్టారు అప్పుడే వస్తూవుండె వేఱే పాఠం చెప్పడానికి!

నాటి మూడో గురువులు—"మూర్తి" నామధేయులు. ఆయనకు "ఆల్కెమీ" అంటే అతి నమ్మకం. పాఠశాలలో రసాయనశాస్త్రం మట్టుకే బోధించినా ఇంటివద్ద మట్టిగిన్నెలతో సహా "ఆల్కెమీ" పరిశోధనే హెచ్చు. ప్రతి లోహాన్నీ బంగారం చేసి పారెయ్యవచ్చునని తలపోసేటంత ధనాశా తత్పరుడు. ఆయన అసలు ఆ రోజున మా క్లాసుకు వస్తాడని అనుకోలేదు. కాని ఏలా టైమ్ టేబిల్ మారిపోయిందో, మరే మాస్టరైనా రాలేదో, ఈయన చక్కావచ్చి, వస్తూనే "హైడ్రోక్లోరిక్ ఆసిడ్" సీసా బల్లమీదపెట్టి "ఇందులో ఏం పడేసినా కరిగిపోతుంది. ఒక్కటితప్ప అంటూ ఒక్కొక్క లోహాన్నే ఇనుమునుండి హిరణ్యందాకా వేస్తూ కాలహరణం గావించి మమ్మల్ని ఉవ్విళ్ళూరించేరు. మేమున్ను గంట అయిపోతూంది అనే తహతహలో వళ్లుమఱచి, మా దగ్గఱవున్న

"భరతమాత" పత్రకాన్ని ఆయనకు ఇచ్చి "ఇవి అందులో పడేసి కరగించండి! చూస్తాం!" అన్నాం. ఆయన అవి అన్నీ గుదిగ్రుచ్చుతూ "ఈ వేళకు పైప్రైపోయింది. రేపు ఆ విద్య మీకు చూపిస్తాను" అని అవి తనదగ్గఱే వుంచుకుని వున్నాడు.

అంతలో ఏదో తాఖీదు వచ్చింది. "అయిదు నిముషాలు అన్ని క్లాసులు నిలుపుచేయవలసింది. విడిచిపెట్టవద్దు ఇళ్ళకు" అని—ఏమా అని మేం రిచ్చపోతూవుంటే మా వైస్ ప్రిన్సిపాల్ గారు ప్రక్కబొత్తాలు సర్దుకుంటూ, పెద్ద కాలేజీ ప్రిన్సిపాల్‌గారు హేట్ ఊపున ముక్కు రాచుకుంటూ, మా గదిలోకి ప్రవేశించి, మా ఎగుజేబులు, దిగుజేబులు తడిమి నఖశిఖ పర్యంతం పరిశీలించారు.

పెద్ద ప్రిన్సిపాల్‌గారు చిన్న ప్రిన్సిపాల్‌గారితో "మీ పిల్లకాయలు చాలా బుద్ధిమంతులల్లే వున్నారు. విప్లవ సూచనలు వీరివద్ద ఏమీ కానరావడంలేదు." అని మాకేసి చూచి "మీ అందఱికీ ఈ అపరాహ్ణం, రేపూ సెలవు" అని చిరునవ్వు నవ్వారు.

మేమాపాళంగా పెద్ద నవ్వుతో కేరింతాలు కొడుతూ, ఒకటే పరుగు మా యిళ్ళకు! డ్యూయల్ దస్కాలు మాటా మఱచిపోయాం. సింగిల్ దస్కాలు మాటా మఱచిపోయాం! నాడు మానుండి మా గురువులు తీసికున్న విప్లవోపకరణాల్ని మఱచిపోయాం!

మేమే కాదు. మాతోపాటు దేశమంతా కూడా క్రమ క్రమంగా మఱచిపోయింది—ఇప్పు డెక్కడా "వందేమాతరం" కీర్తన జాతీయగీతంగా వినిపించడం లేదుగదా!—"బాప్

లాప్ సాల్" ముగ్గురూ కూడా అవమానింపబడివున్నారనే ఉద్ఘాటింపవచ్చును. ఎంచేత అంటే మన రాజ్యం "సెక్యులర్" రాజ్యం అని అంటున్నాం. ఆ కారణంగా హిందూమత సిద్ధాంతాన్ని తిరస్కరించి పారవెయ్యడమే కాకుండా, అవతల పాంచాల రాష్ట్రాన్ని ఇవతల వంగరాష్ట్రాన్ని ముక్కముక్కలుగా చేసి తుడిచిపెట్టాం. ఇక పై ముప్వురు వంచింపబడక, ఎంచబడ్డవారెలా కాగలరు? ఇంకా చెప్పుకుంటే సిగ్గు! సిగ్గు! కైలాసంనుండి బ్రహ్మదేశం దాకా పరిఢవిల్లిన తల్లి దేశపు పయట లాంఛనం, మేలిముసుగు శుభాంచలం, అమానుష కర్మకాండకు ఆహూతి అయిపోయినాయి!

ఏం జరిగినా చెప్పదగ్గ ఒక అంశం మాత్రం మిగిలి వుంది! ఆనాడు మాకు పాఠాలంత చమత్కారంగా చెప్పి పాఠశాలయొక్క పరువు నిల్పిన ఆ ముగ్గురు పంతుళ్లూ నేటికీ కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామల్లాగు పొడగడుతూ వుంటారు నా కళ్ళకు! నిజంగాకూడా బ్రతికి బాగా వున్నారు!

....

అయితే మెట్రిక్యులేటు - లేకుంటె ఫేటు

ఇంగ్లీషు భాష మాట్లాడకూడదని శాసిస్తే అది పోవాలిగాని, అందాకా ఆనోటా ఆనోటా ఎల్లకాలం ఉద్ఘోషింపబడే ఒక పాత "ఎలొక్యూషన్" ఖండిక వుంది. అది ఏమా అంటే-"మెట్రిక్యులేషన్ ఎగ్జామినేషన్ ఈస్ ఎ గ్రేట్ బాదరేషన్, సో, ది స్టూడెంట్ పాపులేషన్ మస్టు గో బాక్ టు కల్టివేషన్, ది చీఫ్ ఆక్యుపేషన్ ఆఫ్ దిస్ నేషన్" అని.